సాక్షి రంగారెడ్డి

7

ఆదివారం । 26 । మే । 2024

శభాష్ కల్పన

- స్థానికులు, నెటిజన్ల అభినందన
- చైన్‌స్నాచర్లను ధైర్యంగా ఎదుర్కొన్న తల్లీకూతుళ్లు
- నిందితుల కోసం గాలింపు



చైన్‌స్నాచర్లపై తిరగబడిన తల్లీకూతుళ్లు

పహాడీషరీఫ్: కళ్లల్లో కారం నీళ్లు చల్లి, కర్రతో దాడి చేసి.. మెడలోని పుస్తెల తాడును లాక్కునేందుకు ప్రయత్నించిన దుండగులను ధైర్యంగా ఎదిరించిన తల్లీకూతుళ్లపై స్థానికులు, నెటిజన్లు అభినందనల వర్షం కురిపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం ఉదయం పిల్లలతో కలిసి తుక్కుగూడ ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లిన మంఖాల్ వాసి గడ్డమీది కల్పన(32) కళ్లల్లో కారం కలిపిన నీళ్లు చల్లిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కల్పనతో పాటు ఆమె కూతురు లక్ష్మీప్రసన్నపై కూడా కర్రతో దాడి చేశారు. ఈ సమయంలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన కల్పన ఆగంతకులతో తలపడి.. వారి బైక్ తాళాలు లాక్కుంది. ఊహించని ఎదురుదాడితో నిర్ఘాంతపోయిన దుండగులు బైక్‌ను అక్కడే వదిలేసి బంగారు గొలుసుతో పరారయ్యారు. ఈ బైక్ నంబర్ నకిలీదని పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన డీఐ సుధీర్‌కృష్ణ, డీఎస్సై భాస్కర్ నిందితుల ప్రాథమిక సమాచారం సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. త్వరలోనే వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

గ్రేటర్‌లోని వివిధ స్కూళ్లలో ఫీజుల మోత ఇలా...

తరగతి	బడ్జెట్ స్కూల్	కార్పొరేట్	సీబీఎస్ఈ	ఐసీఎస్ఈ
నర్సరీ	రూ.15వేలు–20 వేలు	రూ.30 వేలు–40 వేలు	రూ. 60 వేలు–1.20 లక్షలు	రూ.60వేలు–2.40 లక్షలు
ప్రీ ప్రైమరీ–1 (ఎల్‌కేజీ)	రూ.18వేలు–25 వేలు	రూ.35వేలు–55 వేలు	రూ.70 వేలు–2 లక్షలు	రూ.66 వేలు–2.70లక్షలు
ప్రీ ప్రైమరీ–2 (యూకేజీ)	రూ.20వేలు–32 వేలు	రూ.38వేలు–58 వేలు	రూ. 75వేలు–2లక్షలు	రూ.68 వేలు–2.70లక్షలు
క్లాస్ 2 టు క్లాస్ 4	రూ.25వేలు–35 వేలు	రూ.40వేలు–60 వేలు	రూ.80వేలు–2.50లక్షలు	రూ.80 వేలు–3లక్షలు
క్లాస్ 5 టు క్లాస్ 6	రూ.30వేలు –45 వేలు	రూ.45వేలు–65 వేలు	రూ.85వేలు–2.50 లక్షలు	రూ.85 వేలు–3లక్షలు
క్లాస్ 7 టు క్లాస్ 9	రూ.35వేలు–50 వేలు	రూ.70వేలు–90 వేలు	రూ.90వేలు–2.80లక్షలు	రూ.90 వేలు–3.20లక్షలు
10వ తరగతి	రూ.40వేలు–60 వేలు	రూ.90వేలు–1.20లక్షలు	రూ.95వేలు–3.40లక్షలు	రూ. 90 వేలు–3.50లక్షలు

పాఠశాలలు అలా..

ప్రభుత్వ పాఠశాలలు	2,505
ప్రభుత్వ గురుకులాలు, ఇతర స్కూళ్లు	2,747
ఎయిడెడ్ పాఠశాలలు	2,42
ప్రైవేటు స్టేట్ సిలబస్ స్కూళ్లు	4,875
సీబీఎస్ఈ సిలబస్ స్కూళ్లు	361
సీఎస్ఈ సిలబస్ స్కూళ్లు	35
ప్లే స్కూళ్లు	220

ఒక్కో విద్యార్థిపై ఖర్చు (రూపాయల్లో)

పుస్తకాలకు	5000-7000
రెండు జతల యూనిఫాం	2000-2500
రెండు జతల షూస్	700-1000
ట్రాన్స్‌పోర్టు చార్జి	1000-1500
స్కూలు బ్యాగు	500-700
టిఫిన్ బాక్స్, బాటిల్స్	250-500
స్టేషనరీ ఖర్చులు	200-500



దోచుకునేందుకు సిద్ధమైన ప్రైవేట్ దండు

ఇట్స్ కార్పొ'రేట్' టైం!



- స్కూలుకో రేటు.. రూ.వేల నుంచి లక్షల వరకు నర్సరీ ఫీజు
- ఫీజుల మోతతో పేరెంట్స్ సతమతం
- ఏటా 20 నుంచి 30 శాతం పెంపు
- ఇంటర్మీడియెట్ విద్యలోనూ ఇదే పరిస్థితి
- గ్రేటర్ సిటీలో సామాన్యులపై పెను భారం
- సర్కారు బడుల్లో ఉచితంగా నాణ్యమైన విద్య
- అయినా.. ప్రైవేటు, కార్పొరేట్ వైపే మొగ్గు
- సగటుజీవుల బలహీనతలే సొమ్ము చేసుకుంటూ..
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలు
- ఫీజుల నియంత్రణపై సిఫారసులు బుట్టదాఖలు
- సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లలో అడ్మిషన్ గగనమే
- నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రభుత్వాలు, అధికారుల వైఖరి

సండే బిగ్‌స్టోరీ

మహమ్మద్ హమీద్ ఖాన్

ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లల భవిష్యత్ బాగుండాలని కోరుకుంటారు. ఉన్నత చదువులు చదివించాలని, వారిని మంచి పొజిషన్‌లో చూడాలని ఆశిస్తారు. అందుకోసం ఎన్ని కష్టాలకోర్చైనా పిల్లలను బాగా చదివించాలని తపిస్తారు. పిల్లల తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా చేసుకొని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఇష్టానుసారంగా ఫీజుల మోత మోగిస్తున్నాయి. జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఇది విద్యార్థుల తల్లిదండ్రులకు తలకు మించిన ఆర్థిక భారంగా మారుతోంది. ప్రభుత్వ పరంగా ఫీజుల కట్టడి నిర్ణయాలు ఆచరణలో అమలు కావడం లేదు. గత పదేళ్లలో ప్రొ. తిరుపతిరావు కమిటీ, మంత్రుల కమిటీల పేరిట ప్రభుత్వం కాలయాపన చేస్తూ వచ్చింది. చివరికి కమిటీల సిఫారసులు బుట్టదాఖలయ్యాయి. ఈసారి కూడా స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులు పెంచేశాయి. గత సంవత్సరం ఫీజు కంటే 20 నుంచి 30 శాతం వరకు ఫీజులు పెరిగాయి. పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ, ట్రాన్స్‌పోర్టు బాదుడు మరింత అదనపు భారంగా తయారైంది. ఇక కొత్త అడ్మిషన్లకైతే తల్లిదండ్రులకు చుక్కలు కనిపించే పరిస్థితి దాపురించింది. నగరంలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల దోపిడీ.. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



కాస్ట్లీ ప్రైమరీ..

ప్రైవేటు బడ్జెట్, కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్ల రుసుం కొంత ఫర్వా లేదనిపిస్తున్నా.. కార్పొరేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈలో కొత్త అడ్మిషన్లకు కనీసం రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేయడం షరా మామూలుగా మారింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, మిషనరీ స్కూళ్లలో సీటు దొరకడమే గగనమైంది. తల్లిదండ్రుల విద్యార్హత, వృత్తి, వార్షికాదాయం బట్టి సీటు కోసం అర్హత సాధిస్తారు. ఇక స్కూల్స్ యాజమాన్యాలు నిర్వహించే మౌఖిక పరీక్షల్లో తల్లిదండ్రులు నెగ్గితేనే సీటు. ఆ తర్వాత అడిగినంత డొనేషన్లు చెల్లిస్తే అడ్మిషన్ లభిస్తోంది. ఆ తర్వాత అకడమిక్ ట్యూషన్ ఫీజు, ఇతరత్రా చెల్లింపులు.. విడతల వారీగా నిర్ణీత గడువు లోపు చెల్లించాల్సిందే. కేవలం ప్రాథమిక విద్యకే రూ.లక్షల భారం భరించాల్సిన దయనీయ పరిస్థితి.

ఇంటర్‌లోనూ అదే డిమాండ్..

టెన్త్ ఫలితాల వెల్లడితో కార్పొరేట్ కళాశాల సీట్లకు డిమాండ్ పెరిగింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఆసక్తి విద్యా సంస్థలకు కాసులు కురిపిస్తోంది. ఇప్పటికే అడ్మిషన్లు మొదలయ్యాయి. ఒకటి, రెండు సీట్లు మాత్రమే ఉన్నాయంటూ ఇష్టానుసారంగా ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఎంపీసీలో ఐఐటీ సీట్లకు పెరిగిన డిమాండ్‌తో మరింత వసూళ్లకు దిగాయి. పేరొందిన కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ డే స్కాలర్‌కు కనీసం రూ.90 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. హాస్టల్ సౌకర్యముంటే రూ. 2.50 లక్షల నుంచి 3.50 లక్షల వరకు తీసుకుంటున్నారు. ఒకే కార్పొరేట్ విద్యా సంస్థకు చెందిన వివిధ బ్రాంచ్‌ల్లో ఫీజులు ఒక్కోలా ఉంటున్నాయి.

సర్కారు బడుల్లో నాణ్యమైన బోధన



కార్పొరేట్ దీటుగా సర్కారు బడుల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన విద్యా బోధన ఉచితంగా అందుతున్నప్పటికీ.. సామాన్య, మధ్య తరగతి వర్గాలు ప్రైవేటు పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన, అనుభవమున్న ఉపాధ్యాయులతో బోధన సాగుతున్నా.. హంగూ ఆర్భాటాలతో ఆకర్షిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల వైపు ఆసక్తి కనబర్చడం సాధారణమైంది.



పెండింగ్‌లో బిల్లు..

ఫీజుల నియంత్రణ కోసం 2017 మార్చిలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో కమిటీ వేసింది. ఆ కమిటీ వివిధ రాష్ట్రాల్లోని స్కూళ్లను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అందులో ఏటా 10 శాతం ఫీజు పెంచుకోవచ్చని ప్రతిపాదించింది. అయితే.. ఫీజుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించింది. స్కూల్ ఫీజుల పెంపును నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో చట్టం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో 11 మంది మంత్రులతో ఫీజు నియంత్రణకు విధివిధానాలు రూపొందించేందుకు ఉప సంఘాన్ని నియమించింది. ఈ కమిటీ కూడా ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 10 శాతానికి మించి ఫీజు పెంచడానికి వీలులేదని సిఫారసులు చేసింది. వీటిపై ప్రత్యేక చట్టం చేసేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలి. కానీ ఆ ప్రయత్నం జరగలేదు. దీంతో ఈ ప్రక్రియ పెండింగ్‌లో పడిపోయింది.

ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఏర్పాటయ్యేనా?



ప్రైవేట్, కార్పొరేట్ బడుల్లో అడ్డగోలు ఫీజుల దోపిడీకి అడ్డు కట్టవేసేందుకు తాజాగా విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల ఖరారుకు ప్రత్యేకంగా ఫీజు రెగ్యులేటరీ కమిటీని (ఎఫ్‌ఆర్‌సీ) ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ప్రొఫెషనల్ కాలేజీల్లో ఫీజులను ఖరారు చేస్తున్నట్టుగానే ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను ఖరారు చేయనుంది. అసెంబ్లీ సమావేశాల్లో సంబంధించిన బిల్లును ప్రవేశపెడితే ఆమోదం పొంది చట్టంగా రూపొందనుంది. దాని ఆధారంగా ఎఫ్‌ఆర్‌సీని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. ఫీజుల నియంత్రణకు ప్రత్యేకంగా చట్టం తెస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఇటీవల ప్రకటించిన విషయం విదితమే. ఈ ఏడాది అది సాధ్యం కాకపోవచ్చని, 2025 –26 నుంచి అమల్లోకి వస్తుందని ఆయన పేర్కొనడం గమనార్హం.

వామ్మో జూన్!

జూన్.. వచ్చేస్తుందంటే విద్యార్థుల తల్లిదండ్రుల్లో దడ మొదలవుతుంది. కొత్త ప్రవేశాలు మొదలుకుని నెలవారీ ఫీజులతో పాటు యూనిఫాంలు, బ్యాగులు, పుస్తకాలు, షూస్, టిఫిన్ బాక్స్, నీళ్ల బాటిల్.. ఇలా పిల్లలకు నిత్యం అవసరమయ్యే స్కూల్ సామగ్రి కొనుగోళ్ల ఖర్చు తడిసిమోపెడవుతుంది. ఇప్పటికే ఇంటి అద్దెలు, గ్యాసు, ఉప్పు, పప్పు, నూనెలు, ఇతర నిత్యావసర ధరలు ఆకాశాన్నంటి.. మధ్య తరగతి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా...తాజాగా స్కూలు అడ్మిషన్ ఫీజులు..డొనేషన్లు, పుస్తకాలు, యూనిఫాం, రవాణా, స్టేషనరీ ఖర్చులు మరింత భారంగా మారనున్నాయి. పైగా నెలవారీ ఫీజులు వీటికి అదనం.

ఫక్తు వ్యాపార కేంద్రాలుగా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ స్కూలైనా అయిదు శాతం కంటే మించి లాభాలు పొందడానికి వీల్లేదు. స్కూళ్లు ఏర్పాటు చేసే సమయంలోనే ఎలాంటి లాభాపేక్ష లేకుండా, సామాజిక సేవే లక్ష్యంగా స్థాపిస్తున్నట్లు అఫిడవిట్ సమర్పిస్తాయి. కానీ వాస్తవంలో మాత్రం అవి ఫక్తు వ్యాపార కేంద్రాలుగా కొనసాగుతున్నాయి.

– మాసారం ప్రేమ్‌కుమార్, సీజేఎస్ అధ్యక్షుడు



25 శాతానికిపైగా పెంచారు



ఏటా పెరుగుతున్న ఫీజుల భారంతో మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. కొద్దో గొప్పో సంపాదన ఉన్న కుటుంబాల పరిస్థితి ఇలా ఉంటే.. తక్కువ వేతనాలతో కాలం గడిపే అసంఘటిత కార్మికులు, చిరుద్యోగుల పరిస్థితి మరెంత దయనీయంగా తయారైంది. ఒక్కో స్కూలు యాజమాన్యం ఒక్కో విధంగా ఫీజులు పెంచేసింది. నియంత్రించాల్సిన ప్రభుత్వం దృష్టి సారించడం లేదు.

– పుష్ప, పేరెంట్



భరించలేనంతగా ఫీజుల భారం

ఉపాధి కోసం కుటుంబంతో నగరానికి వచ్చాం. ఇద్దరు చిన్నపిల్లలు ఇంటి సమీపంలోని ప్రైవేటు స్కూల్‌లో చేర్పించేందుకు సంప్రదించాను. ఎల్‌కేజీకి రూ. 30 వేలు, యూకేజీకి రూ.35 వేలు, అదనంగా అడ్మిషన్ ఫీజు రూ. 10వేలు చెల్లించాలని చెప్పారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం కూడా స్కూల్‌లో కొనుగోలు చేయాలని సూచించారు. మొత్తం ఇద్దరు పిల్లలకు కలిపి రూ. లక్ష వరకు అవుతుంది. అంత భారం భరించే పరిస్థితి లేదు. పిల్లల చదువులెలా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నాను.



– లాల్ మహమ్మద్ అన్సారీ, బాలాపూర్

ఎల్‌కేజీకే రూ.45 వేలు



ప్రాథమిక తరగతుల ఫీజులు భరించలేనంతగా ఉన్నాయి. మా పాపకు ఎల్‌కేజీలో అడ్మిషన్ తీసుకున్నాం. ట్యూషన్ ఫీజు రూ. 45 వేలు ఉండగా, అదనంగా అడ్మిషన్ ఫీజు చెల్లించాం. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ డ్రెస్, షూస్, బ్యాగ్ ఇతర స్టేషనరీలకు అదనంగా మరో 10 వేల వరకు ఖర్చు అయింది. ప్రైమరీ తరగతులకే ఇంతగా ఉంటే పైచదువుల భారం ఆలోచిస్తేనే భయం వేస్తోంది.

– లీలా ప్రతిభ, బడంగ్‌పేట

నియంత్రణపై కొరవడిన చిత్తశుద్ధి

కాంగ్రెస్ ప్రభుత్వానికి సైతం ఫీజుల నియంత్రణపై చిత్తశుద్ధి కనిపించడంలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు కమిటీలు, సిఫార్సుల పేరుతో కాలయాపన చేసింది. సర్కారు తీరుతో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేస్తూ వచ్చాయి. ఆరునెలల క్రితం కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకొస్తామని ప్రకటించింది. కానీ ఈసారి ఫీజుల కట్టడి సాధ్యం కాకపోవచ్చు. 2025 –2026 నుంచి అమల్లోకి వస్తుందని విద్యాశాఖ లీకులు ఇవ్వడం విస్మయపరుస్తోంది.

– వెంకట్, సంయుక్త కార్యదర్శి, స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్



మరోసారి రోడ్డు కబ్జాకు యత్నం

- అడ్డుకున్న స్థానికులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు, సర్కిల్‌లో ఆక్రమణకు పాల్పడేందుకు యత్నిస్తున్న వ్యక్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: పలు కాలనీలకు వెళ్లే ప్రధాన దారిని కబ్జా చేసేందుకు కొంతమంది వ్యక్తులు యత్నించారు. ఇది గుర్తించిన స్థానికులు అడ్డుకున్నారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. కాలనీవాసుల వివరాల ప్రకారం.. బృందావన్ హోటల్‌కు ఆనుకుని జాతీయ రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లేందుకు ఆయా లే అవుట్లు చేసిన సమయంలో (సర్వే నబర్ 175) రోడ్డు వేశారు. ఈ రహదారిని నిర్మించి సుమారు 25 ఏళ్లవుతోంది. ఇటీవల కొంతమంది వ్యక్తులు దీన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. 20 రోజుల క్రితం దారికి అడ్డంగా జేసీబీతో గుంత తవ్వారు. స్థానికులు అడ్డుకోవడంతో తిరిగివెళ్లారు. ఇదిలా ఉండగా శనివారం మళ్లీ వందలాది మంది మహిళా కూలీలతో రోడ్డుకు నాలుగు వైపులా ఇనుప రేకులు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. స్థానిక ఆపిల్ ఎవెన్యూ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డితో పాటు సభ్యులు, వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు, మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. రోడ్డుపై ఎలాంటి నిర్మాణాలు, ఆక్రమణలు చేపట్టకూడదని గట్టిగా హెచ్చరించడంతో ఆక్రమణదారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏళ్ల తరబడి ఉన్న రహదారిపై ఎలాంటి ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డి.. కమిషనర్ రవీందర్‌రెడ్డిని కోరారు.

వైద్యాధికారుల పీహెచ్‌సీ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సుధీర

కొత్తూరు: అర్హులైన ప్రతి ఒక్కరికి వ్యాక్సినేషన్ చేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర అన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇమ్యునైజేషన్, వ్యాక్సినేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్లు దామోదర్, హరికృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సిబ్బంది చిట్టిబాబు, రవికుమార్, అనసూయ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి

- డీఈఓ సుశీందర్‌రావు
- అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన



దేవునిఎర్రవల్లి పాఠశాలలో పనులను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ సుశీందర్‌రావు

చేవెళ్ల: పునఃప్రారంభం నాటికి పాఠశాలల్లో అన్ని పనులు పూర్తి చేయాలని డీఈఓ సుశీందర్‌రావు ఆదేశించారు. మండలంలోని దేవునిఎర్రవల్లి, గొల్లపల్లి, కొకుంట్ల పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆయా స్కూళ్లలో కొనసాగుతున్న మరుగుదొడ్లు, కరెంట్ సరఫరా పనులను పరిశీలించారు. అనంతరం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మొదటి విడతలో ఎంపికైన 20 స్కూళ్లలో చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఇవి పూర్తయితే రెండో విడత పాఠశాలలను ఎంపిక చేసే అవకాశం ఉంటుందన్నారు. గడువులోపు అన్ని వసతులు సమకూరేలా చూసుకోవాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనని తెలిపారు. మండల విద్యాధికారి, మండల పరిషత్ అధికారి, పంచాయతీ ఏఈలు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సయ్యద్ అక్బర్, ఎంపీడీఓ హిమబిందు, ఏఈ ప్రశాంత్, ఏపీఓ రాజశేఖర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు కృష్ణ, శంకర్, శ్రీనివాస్, ఆయా గ్రామాల నాయకులు మాణిక్యరెడ్డి, శ్రీశైలం, రాములు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

అనాథలకు పండ్ల పంపిణీ

శంషాబాద్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుర్రం రణధీర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రితోపాటు అనాథశ్రమాల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రాజకీయంగా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్ర మంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుంటి ప్రవీణ్‌కుమార్ (మిట్టు) నజీరుద్దీన్, సుబోద్,పాల్సన్, సంజీవ్‌రెడ్డి, నజ్ముద్దీన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హార్డ్‌వేర్ పార్కులో భారీ అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


పూర్తిగా కాలిపోయిన కంపెనీలోని సామగ్రి

బూడిదైన ప్లాస్టిక్ సంచుల తయారీ కంపెనీ

- ప్రాణాలతో బయటపడ్డ కార్మికులు
- రూ.5.5 కోట్ల మేర ఆస్తినష్టం

పహాడీషరీఫ్: హార్డ్‌వేర్ పార్కులోని ప్లాస్టిక్ సంచుల తయారీ కంపెనీలో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. భారీగా మంటలు వ్యాపించడంతో అందులో పనిచేస్తున్న కార్మికులు బిక్కుబిక్కుమంటూ బయటపడి ప్రాణాలు దక్కించుకున్నారు. దాదాపు ఆరు గంటల పాటు ఐదు ఫైరింజన్లు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హార్డ్‌వేర్ పార్కులోని కంచ ఇమారత్‌లో పిరిడి రఘు అనే వ్యాపారి 'శ్రీనాథ్ వోవెన్ ప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్'ని నడుపుతున్నారు. శుక్రవారం రాత్రి కంపెనీలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగలతో కూడిన మంటలు రావడంతో కంపెనీలో ఉన్న 30 మంది కార్మికులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యారు. అయినప్పటికీ చాకచక్యంగా ఒక్కొక్కరుగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డిలు ఘటనా స్థలానికి చేరుకొని ఐదు ఫైరింజన్లను రప్పించి తెల్లవారు జాము వరకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. మంటలు పక్క కంపెనీలకు వ్యాపిస్తాయని అందరూ ఆందోళన చెందినప్పటికీ, అక్కడికే పరిమితం కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యుదాఘాతంతో ప్రమాదం జరిగిందా? మరే ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్లాంట్లు, మిషనరీలు, షెడ్లు, అన్ని రకాల సామగ్రి కలిపి రూ.5.5 కోట్ల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు యజమాని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

యాచారం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన శివకుమార్ ఈ నెల 23న నగరంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి శనివారం వచ్చి చూడగా తలుపు తీసి ఉంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.50 వేల విలువైన ఆభరణాలు, రూ.10 వేల నగదును తీసుకెళ్లినట్లు గుర్తించారు. శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

అన్నదమ్ముల మధ్య తగాదా

తలకొండపల్లి: భూమి విషయంలో అన్నదమ్ములు గొడవ పడిన సంఘటన మండల పరిధిలోని పాతకోట తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన దీప్లా, శంకర్‌లు అన్నదమ్ములు. వీరి తండ్రి బద్యాకు ఇద్దరు భార్యలు. పెద్ద తల్లి కుమారుడు దీప్లా, చిన్న తల్లి కుమారుడు శంకర్. బద్యాకు 8 గుంటల పొలం ఉంది. తండ్రి చనిపోకముందే దీప్లా 8 గుంటల భూమిని తన పేరు మీద పట్టా చేయించుకున్నాడు. శంకర్ ఆ భూమిలో నాకు హక్కు ఉందని సోదరుడితో తగాదా పెట్టుకున్నాడు. పెద్ద మనుషుల సమక్షంలో ఇరువురి మధ్య రాజీ కుదిరింది. దీప్లా ఒక గుంట భూమిని శంకర్‌కు ఇచ్చాడు. ఆ భూమిలో శంకర్ ఈ మధ్య ఇళ్లు నిర్మించుకున్నాడు. నా భూమిలో శంకర్ అక్రమంగా ఇళ్లు నిర్మించాడని దీప్లా శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

భర్తే హత్య చేశాడంటూ మృతురాలి బంధువుల ఆరోపణ


పారిజాత (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: అనుమానాస్పద స్థితిలో గృహిణి మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన నార్లకొండ మహేందర్‌కు ఇబ్రహీంపట్నం మండలం మన్యగూడ చెందిన పారిజాత(39)తో 14 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వివాహం అయిన రెండేళ్ల నుంచే దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి ఇద్దరికీ సర్దిచెప్పారు. అయినప్పటికీ.. మహేందర్ మద్యానికి బానిసై పారిజాతను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. శుక్రవారం రాత్రి పారిజాత పురుగు మందు తాగిందని ఆమె కుటుంబసభ్యులకు మహేందర్ సోదరుడు జంగమయ్య తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. హుటాహుటిన బంధువుల తరలివెళ్లగా పారిజాత విగత జీవిగా పడి ఉంది. భర్త వేధింపులు తాళలేక తన సోదరి ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి సోదరుడు సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. భర్తే భార్యను చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడంటూ మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

'హిట్ అండ్ రన్'ను ఛేదించిన పోలీసులు

- వృద్ధుడిని ఢీకొట్టి పరారైన 'వాలెట్ పార్కింగ్' డ్రైవర్

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసును పోలీసులు ఛేదించారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ఓ వృద్ధుడి మరణానికి కారణమై.. అక్కడి నుంచి తప్పించుకున్న ఇద్దరిని సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 18న మధ్యాహ్నం పంజగుట్ట కూడలి వద్ద ఉన్న జాయ్ అలూకాస్ షోరూం యూటర్న్ వద్ద ఓ గుర్తుతెలియని వృద్ధుడు అపస్మారకస్థితిలో ఉన్నాడు. అక్కడే జాయ్ అలూకాస్ వ్యాలెట్ పార్కింగ్ వద్ద డ్రైవర్‌గా పనిచేసే నాగనాథ్ ఆగ్రే 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వెళ్లి చూడగా అప్పటికే వృద్ధుడు మృతి చెందాడు. సీసీ కెమెరాల ఫుటేజీ గమనించగా కారును నిర్లక్ష్యంగా నడిపిన ఓ వ్యక్తి వృద్ధుడిని ఢీకొన్నట్లు గుర్తించారు. కారు ఎర్రమంజిల్‌లోని మెరిడియన్ హోటల్ వాలెట్ పార్కింగ్ విధులు నిర్వహించే మహమ్మద్ రఫీక్ నడుపుతుండగా వాలెట్ పార్కింగ్ ఏజెన్సీ మేనేజర్ పెంట సిద్ధార్థ కూడా కారులో ఉన్నారు. వీరు వృద్ధుడిని ఢీకొన్న తర్వాత కొన్ని సెకన్లు మాత్రమే ఆగి అక్కడి నుంచి పారిపోయారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదని చెప్పారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

సిలిండర్ రీఫిల్లింగ్ ముఠా గుట్టు రట్టు


సిలిండర్లతో పట్టుబడ్డ నిందితుడు షేక్ రహమాన్

- జనావాసాల నడుమ నిర్వహిస్తున్న వైనం
- జల్‌పల్లిలో ఎస్ఓటీ పోలీసుల దాడులు
- 91 సిలిండర్లు, ఫిల్లింగ్ సామగ్రి స్వాధీనం
- నిందితుడు అరెస్ట్, పరారీలో మరొకరు

పహాడీషరీఫ్: జనావాసాల నడుమ ప్రమాదపుటంచున ప్రైవేట్ గ్యాస్‌ను భారత్, ఇండేన్ కమర్షియల్ సిలిండర్లలోకి ఫిల్లింగ్ చేస్తున్న ముఠా గుట్టును మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు శనివారం రట్టు చేశారు. ఏకంగా ఓ గోడౌన్‌నే ఏర్పాటు చేసుకొని కనీస జాగ్రత్తలు పాటించకుండా రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 91 గో గ్యాస్, భారత్, ఇండేన్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టకు చెందిన షేక్ రహమాన్(33), బబ్లులు కొన్నాళ్లుగా జల్‌పల్లి శ్రీరాం కాలనీలో ఓ గోడౌన్‌ను అద్దెకు తీసుకొని అందులో గుట్టు చప్పుడు కాకుండా ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. 'గో గ్యాస్' కంపెనీ సిలిండర్ల నుంచి వాణిజ్యానికి వినియోగించే భారత్, ఇండేన్ సిలిండర్లలోకి ఫిల్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకే ప్రదేశంలో ఇంత భారీ ఎత్తున రీఫిల్లింగ్ చేస్తున్న క్రమంలో ఏదైనా జరగరానిది జరిగితే ఊహకందని స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, ఎస్సై రాజుల బృందం శనివారం దాడులు నిర్వహించి ఒక డిజిటల్ తూకం, 91 సిలిండర్లతో పాటు రీఫిల్లింగ్‌కు వినియోగించే 13 రీఫిల్లింగ్ రాడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రహమాన్‌ను తదుపరి విచారణ నిమిత్తం పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు. మరో నిందితుడు బబ్లూ పరారీలో ఉన్నాడు.

పట్టుబడ్డ సిలిండర్లు ఇవే

ఈ దాడుల సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో 'గో గ్యాస్' కమర్షియల్ ఖాళీ సిలిండర్లు–34, నిండు సిలిండర్లు–13, భారత్ గ్యాస్ కమర్షియల్ నిండు సిలిండర్లు–15, ఖాళీ సిలిండర్లు–14, ఇండేన్ గ్యాస్ కమర్షియల్ ఖాళీ సిలిండర్లు–15గా ఉన్నాయి.

స్థానిక పోలీసులకు తెలియదా?

అక్రమ వ్యాపారాలకు కేంద్ర బిందువుగా ఉన్న జల్‌పల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ వ్యాపారాలు స్థానిక పహాడీషరీఫ్ పోలీసులకు తెలియకుండానే జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. పరస్పర సహకారం కారణంగానే మిన్నకుండి పోతున్నారన్న విమర్శలున్నాయి. ఎస్ఓటీ పోలీసులు వచ్చి దాడులు చేసేంత వరకు కూడా స్థానిక పోలీసులు తెలియనట్లుగా ఉండడమే ఈ ఆరోపణలకు ఊతమిచ్చేలా ఉంది.

వ్యక్తి అదృశ్యం


నర్సింహులు (ఫైల్)

షాబాద్: నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమారుడిని చూడటానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన షాబాద్ మండలంలోని నాగర్‌కుంట గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పానుగంటి నర్సింహులు(50) ఈనెల 14వ తేదీన ఉస్మానియాలో చికిత్స పొందుతున్న తన కుమారుడికి చూడటానికి వెళ్లారు. ఆ క్రమంలోనే ఆయన అదృశ్యమయ్యారు. అప్పటినుంచి కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రి పరిసరాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆయన ఆచూకీ తెలిస్తే 82975 22514 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

హాస్టల్ నుంచి బయటికి వెళ్లిన విద్యార్థిని..


వీణాంజలి (ఫైల్)

మొయినాబాద్: హాస్టల్‌లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఉన్న రక్షణదీపం ఆశ్రమం హాస్టల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ గ్రామానికి చెందిన ములుమరి వీణాంజలి(18) హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఈ నెల 23న ఉదయం ఆమె హాస్టల్‌లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. వేణు అనే అబ్బాయిపై తమకు అనుమానం ఉందని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని బాలుడి..


షహవాజ్ అన్సారీ (ఫైల్)

పహాడీషరీఫ్: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ మైనర్ బాలుడు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులుశనివారం తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్‌కు చెందిన ఫక్రుద్దీన్ కుమారుడు మహ్మద్ షహవాజ్ అన్సారీ(15)కు మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈ క్రమంలోనే ఈ నెల 18వ తేదీ ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన అన్సారీ తిరిగి రాలేదు. అతనిఆచూకీ కోసం వెతికినా లాభం లేకపోవడంతో ఫక్రుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

భార్య కళ్లెదుటే గల్లంతు

- చెరువులోకి దూకిన భర్త
- దంపతుల మధ్య గొడవలే కారణం


ప్రవీణ్ (ఫైల్)

మీర్‌పేట: దంపతుల మధ్య కలహాలతో క్షణికావేశంలో భార్య చూస్తుండగానే భర్త చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నందనవనం భూపేష్‌గుప్తానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ జాదవ్ ప్రవీణ్(30), కమల భార్యాభర్తలు. ఇరువురి మధ్య గొడవ జరగడంతో రెండ్రోజులుగా ప్రవీణ్ ఇంటికి వెళ్లలేదు. ఈ క్రమంలో మాట్లాడుకునేందుకు భార్యాభర్తలతో పాటు మధ్యవర్తిగా ప్రవీణ్ స్నేహితుడు ముగ్గురు కలిసి శనివారం సాయంత్రం మీర్‌పేట మంత్రాల చెరువు వద్దకు వచ్చారు. భార్యాభర్తల మధ్య మాట మాట పెరగడంతో క్షణికావేశానికి లోనైన ప్రవీణ్ ఆత్మహత్య చేసుకునేందుకు చెరువులోకి దూకాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. చెరువులో బురద ఎక్కువగా ఉండడంతో ప్రవీణ్ చాలా లోతువరకు వెళ్లి కూరుకుపోయి ఉంటాడని, ప్రత్యేక బృందాలను రప్పించి ఆదివారం మృతదేహాన్ని వెలికితీస్తామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.